# అర్ధ-నారి

●

స్నానానికని పరికరాలన్నీ పట్టుకుని, మెట్లు దిగుతున్నాను. దిగువను, కుళాయిదగ్గిర, మా తాయారమ్మ ఎవరిమీదనో గొంతుచించుకుంటూంది:

తెల్లవారగానే ఎవరా, అక్షింతలువేయించుకునేందుకు అప్పుడే తయారైనారు అనుకుంటూ, యింకో రెండు మెట్లుదిగి, పక్కనున్న కటకటాలలోనుంచి, ఆవారకు పరకాయించాను.

గుమ్మంలో - ఆ మనిషి, నదురూబెదురూ లేకుండా, అంటూన్నది తన్ను కాదన్నట్టునిలుచునిఉంది. తాయారమ్మ కుళాయి మొగదలనుంచి, ముఖం కండలుచించుకుంటూ, మీదికి లంఘించబోతూంది.

—'ఎత్తింది ఆడజన్మకాదటే!-

'సిగ్గు ఉండక్కర్లా?—

'ఫో..................'

'పోవేం' అంటూ చేతిలోవున్న చెంబుకాస్తా ఆ మనిషిమీదికి గిరవాటువేసింది.

అవతలమనిషి, తొణకకుండా అది అందిపుచ్చుకుని మళ్లిపోతూంది. దాని, ఓగాయిత్యం చూసి, అరచుకుంటూ

'దొంగ - దొంగ-' అని పొలికేకలతో ఊరూ - నాడూ ఏకంచేస్తూ, తాయారమ్మ వీధిలో పోయి పడ్డది.

వాళ్ళనడుమను, నలుగురూ పోగైనారు. తలొకడూ తలోమాదిరిగానూ నిలవేసి గద్దిస్తున్నారు......పట్టపగలే యింటో జొరబడి, దోచుకుపోతూంది.

'లేదు!- ఆ తల్లి. నామీదికి బిచ్చంపారేసింది. పుచ్చుకుపోతున్నాను-' అంటూంది ఆ మనిషి.

తాయారమ్మ అందరిలోనూ, ముక్కుమీద వేలేసుకుంది—

"పొమ్మని గిరవాటు వేస్తే..."

'—వేసింది బిచ్చమనుకుని పుచ్చుకున్నా అమ్మా..'

మేమందరం పకాల్‌మన్నాము.

"వేసే తల్లులందరూ...యింతే, యిలాగే మొగాన విసిరేస్తారు బాబూ - నూటికో కోటికో ఓ తల్లి యిందవే అమ్మా అంటూ, జాలితలుస్తుంది కాని..."

—నా మనసు జివ్వ్వమన్నది.

ఒక్కరూ తన్ను వెనకేసుకురాకుండా, బెల్లంకొట్టిన రాళ్ళల్లే ఉండటం చూసి, తాయారమ్మ నిప్పులేకుండానే తగులడిపోతూంది...

"ఏమిట్రా చూసేది - సిగ్గుమాలినకుంకల్లారా!— ఆడది గుడ్డఊడదీసుకువస్తే ఏమిట్రా చూసేది" అని, చుట్టూ నుంచున్న కుర్రాళ్ళనందర్నీ కసరి, దానిచేతుల్లోంచి ఆ చెంబు ఊడలాక్కుని, ఏడుపు మొంగతో యింట్లోకి పారిపోయింది.

అందరూ, ఎవరిగుమ్మాల్లోకి వాళ్ళు పోయినారు. ఆ మనిషొక్కతే మిగిలింది... నేనుకూడా అక్కడ అందాకటి నుంచీ నిలుచున్నానన్న సంగతి అప్పుడు నాకు తెలిసొచ్చింది. దానిబంటిమీద నా రెండుగ్రుడ్లూ సిగ్గుమాలి పొరలాడుతున్నాయ్!...

"పో బాబూ, మొండిమొలేసుకొచ్చింది మొగాళ్ళ కోసం కాదు. నీమానాన నీవు పో!—"

కత్తివాటంగా, అని చీరముడుత రవంత క్రిందికి లాక్కుంది. నేను మేకపోతల్లే గొంతు గొణుక్కుంటూ, మామూలుగా లాల్చి - జేబు వ్రేళ్ళాడే అంతమేరా తడుముకున్నాను.

"అబ్బో! దిగివచ్చాడు, ధర్మరాజు!"

దానిమాటల్లో, ఎంత మంట ఉందని? ఎందుకూ యీ బసివికి నామీద యింత కోపం? - పుణ్యానికిపోతే పాపం ఎదురైనట్లు - పోనీ పాపం! అని దానిస్థితికి జాలిపడి—

ఇన్నిముక్కలూ పట్టుకు తిట్టేశాను. విని, విని, చివరకు, అది ఛర్ర్‌మంది...

"వయసూ, వళ్లూ అమ్ముడుపోకుండా అడుక్కుతింటున్నామనేనా - మూరాజా యీ ఆగ్రహం అంతా..." అంటూ మెత్తని కత్తికోతగా-రెప్పవాల్చకుండా అడిగింది...

నేను, గుక్కతిప్పుకోలేక, ఒక్కఅంగలో యింట్లోకి దూకి, మెట్లన్నీ ప్రాకి - దిండుతోబాటు గోడకి కూలబడ్డాను. సబ్బుపెట్టె అదిరిపడి...బావురుమంది. స్నానానికని

క్రిందకు వచ్చినవాడికి...దానివిసురుకు మళ్ళా ఎప్పటి చోటికే వచ్చిపడ్డానా?–

చట్టుకు సత్తువతెచ్చుకుని...బాసెపట్టుమీద, లేచి కూర్చుంటున్నాను...గుమ్మంమీద అది నిలుచునిఉంది.

"ఏం బాబూ...నేను జ్ఞాపకంరాలేదా?– అంటూ అడుగు లోపలికివేసింది...

నాకు – యింకా జ్ఞప్తికిరాలేదు.

"నేను – సీతాయినయ్యా! పదేళ్ళక్రితం – నేనూ – మా అమ్మా, మీ పాదాలకడ బ్రతికేవాళ్ళం..."

ఆఁ – అదా యిది! – పనిచేస్తూ చేస్తూనే ఒకనాడు ఉన్నట్టుండి, చెప్పకుండా యిద్దరూ మాయమైనారు. వాకబుచేశాను. కాని, ఎటుపోయినారో ఎవళ్లూ చెప్పలేదు. సరే, వీళ్ళసంగతి ఎన్నాళ్ళు జ్ఞాపకంఉంటుంది? అప్పుడే మరచిపోయినాను. – ఇది ఇంత పెరిగి పెద్దదైందా? – దీని అమ్మ ఏమైనట్టు? – బాగుందా ?

నా మనసులోసందేహాలు అన్నింటికీ అది జవాబులు చెపుతూంది——

——"ఆవాళ, మాపటేల – సందుమలుపులో, నా చెయ్యిచ్చుకున్నారా? —— అదిరిపోయి బేవురుమన్నాను కదూ? అప్పు డెప్పుడో చేసిన పాడుపనికి, యిప్పుడు సిగ్గందుకులెండి – చేయిగుంజుకుని ఆపళాన పోయి, మా అమ్మ మీద పడి, చెప్పడానికి జిహ్వాచచ్చిపోయి, ఎలాగో మొత్తుకున్నాను. మా అమ్మ బెంబేలుపడిపోయి – నెత్తీనోరూ కొట్టుకున్నది——ఆవాళనుంచే మీయింట్లో పని మానిపిం

చింది. మళ్ళా జీతం అడిగేందుకైనా, మీ యింటిచాయలకు రాలేదు మేము. మా అమ్మంటే - మంచి నీతైన మనిషి బాబూ.

కొన్నాళ్లు రోజులు ఎల్లాగో వెళ్ళమారించుకున్నాం. మా అమ్మకు ఆనాటికి ఆనాటికి కొనఊపిరిపడుతూంది. నా రెక్కలే మా యిద్దరికీ కాచిపోయాలి. పడుచుపిల్లలంటే - పనీపాటా చేయడానికి రమ్మని ఎవళ్ళుపడితే వాళ్ళు పిలుస్తారు. కాని, రెక్కలకష్టంతో పోనిస్తారా, - అడిగినదానికల్లా అచ్చుకుంటేనే, ఆ నెలకు జీతం ముట్టజెప్పేది.

అలా బ్రతుకుదామంటే, నాకు తగనిరోత - మా అమ్మకు అంతకంటే చీదర.

అడుక్కుతిందామని, ఊరిమీదపడ్డాం. కాని ఏం లాభం - ఎంత గొంతుచించుకున్నా పూటకు చేరెడుగింజలు జోలెలో రాలేవికావు - ఏ మొగాణ్ణి దేవురించినా కన్నుగొట్టి నిదానించేవాడే కాని, కనికరించి ఓ కానిడబ్బు మా మొగాన కొట్టేవాడుకాడు. ఏ అమ్మలక్కను బ్రతిమాలినా ఏ తల్లికా తల్లి ఇల్లా "ఎత్తుకు తినకపోతే, దుక్కలాగా ఉన్నావ్, ఎక్కడన్నా పనీ పాటా చేసుకోరాదుటే!" అని కసిరికొట్టేది.

ఏమిటి - వయసులో ఆడదిచేసే పనీ పాటా?- లోకంసంగతి నీకు ఎరుకలేనిదేమిటి బాబూ...

నన్ను అమ్ముకునన్నా నన్నుకన్నదాన్ని పోషించుకుందామనుకున్నా - నిబ్బరం తెచ్చుకుని బయలుదేరేదాన్ని. కాని, మొగాడికన్నా మా పాపిష్టిది బాబూ - కన్ను మీద

వొరిగేసరికల్లా కాళ్ళు గజగజలాడేవి. ఛీ అనుకుని మళ్ళీ పోయేదాన్ని—

పట్టపగలే దొంగతనం మొదలెట్టా. పట్టుపడ్డా- కొట్లో కూచున్నా. ఒకసారి కాదు, యిప్పటికి ముమ్మారైంది...

ఇలా తిరుగుతూఉంటా — మళ్ళా జైలుకువెళ్ళే దాకా...

ఆడకూతురికి - జాలిపుట్టించడం మా సుళువయ్యా! ఇలా ఒళ్ళుకనబడేట్టు, చాలీచాలంది ఓ చింకిచుట్టుకుని, బిక్కమొగం వేసుకుని, సాటి ఆడకూతుర్ని "తల్లీ, మొల చుట్టూ బట్టలేక, ఇలా మానానికి మ్రగ్గిపోతున్నా మాయమ్మా'- అని అరిచానా అంటే, ఆ యిల్లాలు, తన గుట్టంతా బట్టబయలైనట్టు కంపరంఎత్తిపోయి, తన మొగుడి కంట నేను పడకుండా ఏదో పాత కోకొకటి నా మొగాన కొట్టి తరిమేస్తుంది. అది, మారుబేరానికి అమ్ముకుంటే— మా ముసిల్దీ నేనూ, వారంరోజులు కడుపునిండా ముప్పొద్దులూ బువ్వతింటాం.

'వచ్చినవీధికి మళ్ళీ రాను. అడిగినతల్లిని మళ్ళీ అడగను - ఎత్తుకు తినేందుకు ఎన్నివాడలైనా ఉన్నాయికదండీ! —ఏం, మా బ్రతుకు బాగుండలా?"

నా మెదడంతా కరిగి కళ్ళల్లో పేరుకుపోయింది.

"ఓసి నీ బ్రతుకు బండలుకానూ - గదిలో శేవిణో వేశావుటే" అని అరుచుకుంటూ, తాయారమ్మ అక్కడికి గంతువేసింది. పోకపోతే, దాన్ని జుట్టుపట్టుకు క్రిందికి ఈడుస్తానన్నది. మళ్ళీ చూడబోతే గడ్డాలూ మీసాలూ వచ్చిన

పెద్దమనిషిని నాకు బుద్ధిఉండక్కర్లేదా...అంది. పట్టపగలే, అందరూ చూస్తూండగానే భార్లాగా ఇలా చేస్తావా అంది. నలుగురిని పోగుచేసి నాకు బుద్ధిచెప్పిస్తానంది...తక్షణం గది ఖాళీచేసేయమంది. నేను వింటూ, ఇల్లరికపుఅల్లుడికిమల్లే గ్రుక్కమింగి ఊరుకున్నాను.

"మళ్ళీ యీ జాడ నెప్పుడన్నా వస్తే చూసిపోతాలే బాబూ..." అంటూ అది, చెక్కుచెదరకుండా మెట్లుదిగి పోతూంది...కడసారిమెట్టుదగ్గిర ఆగి, "యీ యిల్లాలితో ఎలా వేగుతున్నావు మాారాజా!" అని నవ్వుకుంటూ పోయింది.

ఎదో యింట్లో అద్దెకుఉన్నపరాయివాణ్ణి అయిపోయినాను. కాని, నిజంగా కట్టుకున్న మొగుణ్నే అయితే, దాని చేత అంత మాటపడి తాయారమ్మ నన్ను బ్రతుకనిచ్చేదా? గదితలుపు గడియ, ఎంత బందోబస్తుగా ఉన్నా - ఆ చేతికీ —నోటికీ అడ్డంవచ్చేదా? పాయె - పో!

సీతాయ్ బ్రతుకు చివరకు ఇలాఅయిందా? ఎలా తెలవారుతుందో - దేశంలో ఎంతమంది పడుచులు... ఇలాగే సీతాయ్‌లు అయిపోతున్నారో!

హుఁ—ఇలాటి చరిత్రాత్మకములైన చచ్చుప్రశ్నలు లక్షాతోంభై. తెలుగువాణ్ణి కనుక పరాఖత్‌గా నాకు నేను వేసుకోగలను. ఎందుచేతనా, వాటికి జవాబుచెప్పుకునే బాధ్యత, నాకూ, నా జాతికీ - వేదకాలంనుంచీ లేదు!

—